# 34

# దేవుని వాక్యమును తృణీకరించిన రాజు

## యూదా రాజైన యెహోయాకీము

## (2 రాజులు 23:34-37; 24:1-7)

యోషీయా కుమారుడైన యెహోయాకీము, యూదా చివరి రాజులలో ఒకడు. యోషీయా మంచి మనిషి, అతని తరువాత వచ్చిన నలుగురు రాజులలో – ముగ్గురు అతని కుమారులు, ఒకరు అతని మనమడు – ఎవరూ అతని మాదిరిని అనుసరించలేదు; అందరూ చెడ్డవారే, వారిలో యెహోయాకీము మరీ దుర్మార్గుడు. అతడు *దేవుని వాక్యమును తిరస్కరించెను* అని చెప్పుట చేత ఈ రాజుల జీవితాలను సంక్షేపింపవచ్చును. దేవుని ఆజ్ఞలపట్ల అతని నిర్లక్ష్యము, అతని గూర్చి తెలియజేయబడిన అనేక వాస్తవాలలో చూడగలము.

### అతడు దేవుని ఆజ్ఞలను తృణీకరించాడు

మొదట, యెహోయాకీము దేవుని ఆజ్ఞలను తృణీకరించుట కనుగొంటాము. లేఖనాలు క్రింది మాటలలో అతని పాలనను వివరిస్తున్నాయి:

> యోషీయా కుమారుడైన ఎల్యాకీమును అతని తండ్రియైన యోషీయాకు మారుగా రాజుగా నియమించి అతనికి యెహోయాకీమను మారుపేరు పెట్టి యెహోయాహాజు ఐగుప్తు దేశమునకు కొనిపోగా అతడచ్చట మృతిబొందెను. యెహోయాకీము ఫరో ఇచ్చిన ఆజ్ఞ చొప్పున దేశము మీద పన్ను నిర్ణయించి ఆ వెండి బంగారములను ఫరోకు చెల్లించుచు వచ్చెను. దేశపు జనుల యొద్దనుండి వారి వారికి నిర్ణయమైన చొప్పున వసూలుచేసి అతడు ఫరోనెకోకు చెల్లించెను.
>
> యెహోయాకీము ఏలనారంభించినప్పుడు ఇరువదియైదేండ్లవాడై యెరూషలేమున పదకొండు సంవత్సరములు ఏలెను. అతని తల్లి రూమా ఊరివాడైన పెదాయ కుమార్తెయగు జబూదా. ఇతడును తన పితరుల చర్యలన్నిటి ప్రకారముగా యెహోవాదృష్టికి చెడునడత నడిచెను.
>
> యెహోయాకీము దినములలో బబులోను రాజైన నెబుకద్నెజరు యెరూషలేము మీదికి వచ్చెను. యెహోయాకీము అతనికి దాసుడై మూడేండ్లు సేవచేసిన తరువాత అతని మీద తిరుగుబాటు చేయగా యెహోవా అతని మీదికిని, తన సేవకులైన ప్రవక్తల ద్వారా తాను సెలవిచ్చిన మాట చొప్పున యూదా దేశమును నాశనము చేయుటకై దాని మీదికిని, కల్దీయుల సైన్యములను సిరియనుల సైన్యములను మోయాబీయుల సైన్యములను అమ్మోనీయుల సైన్యములను రప్పించెను. మనష్షే చేసిన క్రియలన్నిటిని బట్టియు, అతడు నిరపరాధులను హతము చేయుటను బట్టియు, యూదావారు యెహోవా సముఖము నుండి పారదోలబడినట్లుగా ఆయన ఆజ్ఞలవలన ఇది వారి మీదకి వచ్చెను. అతడు నిరపరాధుల రక్తముతో యెరూషలేమును నింపినందున అది క్షమించుటకు యెహోవాకు మనస్సులేకపోయెను. యెహోయాకీము చేసిన ఇతర కార్యములు గూర్చియు, అతడు జరిగించినదానంతటిని గూర్చియు యూదా రాజుల వృత్తాంతముల గ్రంథమందు

వ్రాయబడియున్నది. యెహోయాకీము తన పితరులతో కూడ నిద్రించగా అతని కుమారుడైన యహోయాకీను అతనికి మారుగా రాజాయెను. బబులోను రాజు ఐగుప్తు నదికిని యూఫ్రటీసు నదికిని మధ్య ఐగుప్తు రాజు వశమున నున్న భూమియంతటిని పట్టుకొనగా ఐగుప్తు రాజు ఇకనెన్నటికిని తన దేశమును విడచి బయలుదేరుట మానెను (2 రాజుల 23:34-24:7).

యెహోయాకీము, "యెహోవా దృష్టికి చెడునడత నడిచెను," అతని పితరుల ప్రవర్తనను అనుసరించి (23:37). అతని ముందు పరిపాలించిన యూదా రాజులలో అనేక మంది ఇతర రాజులవలెనే, అతడు యెహోవా న్యాయవిధులను తిరస్కరించాడు.

ఫలితము, దేవుడు యూదా మీదికి, సిరియనుల, మోయాబీయుల, అమ్మోనీయుల దండ్లను పంపుట ద్వారా యూదా మీద తీర్పు తీర్చటం ప్రారంభించాడు. బహుశా, ఈ దాడులు యెహోయాకీము బబులోను వారికి ఎదురు తిరిగిన తరువాత, బబులోనీయులతోనే ప్రారంభమయి ఉంటాయి. అయితే, తెరవెనుక, - యెహోయాకీము, యూదావారి అవిధేయతను బట్టి వారిని శిక్షించు బాధ్యత కలిగినవాడు దేవుడే!

## అతడు దేవుని ప్రజలను తృణీకరించాడు

రెండవది, దేవుని ప్రజలను తృణీకరించుట ద్వారా యెహోయాకీము దేవుని వాక్యము పట్ల నిర్లక్ష్యాన్ని చూపించాడు. ఐగుప్తు రాజు ద్వారా యూదా మీద విధించబడిన పన్ను చెల్లించుట కొరకు అతడు ప్రజలపై భారమైన పన్నులు విధించాడు. యిర్మీయా 22:13-19లో, ప్రవక్తయైన యిర్మీయా ప్రవచించుట ద్వారా వివిధ కారణాలను బట్టి యెహోయాకీమును నిందించాడు. (1) "నీతి తప్పి" అవసరతలో ఉన్న పేదలను, దరిద్రులను వాడుకొనుట ద్వారా తన ఇల్లు కట్టించుకొన్నాడు (యిర్మీయా 22:13-16). మరియు (2) "నిరపరాధుల రక్తము చిందించాడు మరియు బాధించుట, బలత్కారించుట అభ్యాసం చేశాడు" (యిర్మీయా 22:17). దేశములో ఉన్న పేద ప్రజలపై పన్ను విధించుటకు తన అధికారాన్ని ఉపయోగించుట ద్వారా యెహోయాకీము తన కొరకు ఒక అందమైన ఇల్లు కట్టుకొన్నాడు. ఇలాంటి కష్ట సమయాలలో ప్రజలు బహు బాధలు అనుభవించారనుట స్పష్టము. మరియు అతడు ఇతర పద్ధతులలో బాధించుట, బలత్కారం చేయుట ద్వారా కూడ దోషి అయ్యాడు.

అతడు దేవుని ప్రజలను నిర్లక్ష్యం చేయుటవలన వచ్చిన ఫలితాలు ఏమిటి? యెహోయాకీమును గూర్చి యిర్మీయా, అతని ప్రవచనాన్ని ఈ మాటలతో ముగించాడు:

> "జనులు ... అతని గూర్చి అంగలార్చారు" అయ్యో, నా యేలినవాడా, అయ్యో, శోభావంతుడా, అని అతనికొరకు అంగలార్చారు. అతడు యెరూషలేము గుమ్మముల ఆవలికి ఈడువబడి పారవేయబడి గాడిద పాతిపెట్టబడురీతిగా పాతిపెట్టబడును[1] (యిర్మీయా 22:18బి, 19).

దేవుని ప్రజలపై రాజైనవాడు ఆ ప్రజలతో అసభ్యంగా వ్యవహరించకూడదు!

## అతడు దేవుని ప్రవక్తలను తృణీకరించాడు

మూడవది, యెహోయాకీము, దేవుని ప్రవక్తలను అమర్యాదగా చూచుట ద్వారా దేవుని వాక్యాన్ని తృణీకరించాడు. యిర్మీయా తన పరిచర్యలో అధిక భాగం, దేవుని ప్రజలను -

యెహోయాకీము, సిద్కియా అను ఇద్దరు రాజులను – వారి పాపములవలన రాజ్యము నాశనము కాబోతుందని హెచ్చరించుటలో గడిపాడు.

ఈ సందేశానికి యెహోయాకీము ప్రతిస్పందన ఏమిటి? దీనికి జవాబు యిర్మీయా చెప్పినదంతా, "ప్రజలు ఒక వేళ తమ దుష్ట మార్గములలోనుండి తిరుగుతారన్న నిరీక్షణతో," పుస్తకపు చుట్టలో వ్రాయమని అతనికి ఆజ్ఞాపించటం మనం కనుగొంటాము (యిర్మీయా 36:1–3). యిర్మీయా శాస్త్రీయైన బారూకుకు ఆ మాటలన్ని చెప్పాడు (యిర్మీయా 36:4) మరియు మందిరము నొద్ద ఆ మాటలు చదువుటకు బారూకును పంపించాడు (యిర్మీయా 36:5–7). బారూకు ఆ మాటలు చదవగా వినిన మొదటి వారు బారూకును, యిర్మీయాను వెళ్లి దాగుకొమ్మని చెప్పారు (యిర్మీయా 36:8–19). ఎందుకు? ఎందుకంటె చదువబడిన మాటలు యెహోయాకీము విన్నట్లయితే, రాజు వారిని పట్టుకొని చంపుతాడని వారికి తెలుసు. రాజువారిని పట్టుకొనుటకు ప్రయత్నించాడు కాని "దేవుడు వారిని దాచినందున" వారు తప్పించుకొన్నారు (యిర్మీయా 36:26).

యిర్మీయాను యెహోయాకీము చంపగల సమర్థుడనుట స్పష్టము. ఎందుకంటె మరొక సందర్భములో యిర్మీయా ప్రవచించినలాంటి సందేశాన్నే ప్రవక్తయైన ఊరియా ప్రకటించినందుకు అతనిని చంపించాడు (చూడు యిర్మీయా 26:20–23).[2] యెహోయాకీము ప్రవక్తలను పట్టించుకోకుండ వదలలేదు, వారు ప్రకటించిన సందేశం అతనికి నచ్చకపోయినట్లయితే, వారిని చంపేసేవాడు!

## అతడు దేవుని భవిష్యత్ వాక్కులను తృణీకరించాడు

నాలుగవది, రాజ్య పతనమును గూర్చి వ్రాయబడిన భవిష్యత్ వాక్కులను నాశనము చేయుటలో దేవుని వాక్యం అతనికి రుచించకపోవటం ప్రత్యేకంగా స్పష్టమవుతుంది. యిర్మీయా 36 ప్రకారము, ప్రజలయెదుట చదువబడిన పుస్తకపు చుట్ట రాజు నొద్దకు తేబడినప్పుడు అతడు దానిని నాశనం చేశాడు:

> యెహూది ... రాజు వినికిడిలోను రాజునొద్దకు నిలిచియున్న అధిపతులందరి వినికిడలోను దాని చదివెను. తొమ్మిదవ మాసమున రాజు శీతాకాలపు నగరిలో కూర్చుండియుండగా అతని ముందర కుంపటిలో అగ్ని రగులుచుండెను. యెహూది మూడు నాలుగు పుటలు చదివిన తరువాత రాజు చాకుతో దాని కోసి కుంపటిలో వేయగా ఆ కుంపటిలోనున్న అగ్నిచేత అది బొత్తిగా కాలిపోయెను గాని రాజైనను ఈ మాటలన్నిటిని వినిన యతని సేవకులలో ఎవరైనను భయపడలేదు, తమ బట్టలు చింపుకొనలేదు – గ్రంథమును కాల్చవద్దని ఎల్నాతానును దెలాయ్యాయును గెమర్యామును రాజుతో మనవి చేయగా అతడు వారి విజ్ఞాపనము వినకపోయెను (యిర్మీయా 36:21బి–25).

తన పాపములను బట్టి యూదా రాజ్యము శిక్షింపబడునను భవిష్యత్తు వాక్కుల ఆ పుస్తకపు చుట్టలో చేర్చబడియున్నది. దాని మాటలు విన్నవారు భయపడి మారుమనస్సును సూచిస్తూ "తమ బట్టలు చింపుకొనుటకు" అది ఉద్దేశింపబడినది. ప్రజలు మారుమనస్సు పొందుటకు ప్రోత్సాహించబడునట్లు ప్రవచనాలు రూపొందించబడ్డాయి. దానికి బదులు యెహోయాకీములో ఎలాంటి స్పందన కలిగించలేదు కాని ఆ ప్రవచనాలు పలికిన ప్రవక్తల పట్ల అతని కోపము రేగింది. పుస్తకపు చుట్ట తీసుకొని, దానిని కోసి, అగ్నిలో వేసి కాల్చుట

ద్వారా ప్రవక్తల మాటలపట్ల అతడు గర్వంగా నిర్లక్ష్యం చూపించాడు! అతడు నాశనము చేసిన పుటలమీద వ్రాయబడిన దేవుని మాటలను అతడు అలా నిర్లక్ష్యం చేశాడు.

పుస్తకపు చుట్ట తగులబెట్టుటవలన యెహోయాకీమునకు ఏదైనా మంచి జరిగినదా? లేదు! దేవుని ఆజ్ఞానుసారం యిర్మీయా అవే మాటలను "ఇంకా అలాంటి అనేక మాటలను కలుపుతూ" దానిని తిరిగి వ్రాశాడు (యిర్మీయా 36:32). ఆయన వాక్యం నాశనము చేయబడదని దేవుడు యెహోయాకీమునకు ఆనాటి యూదా ప్రజలకు చూపించాడు! యెహోయాకీము పుస్తకపు చుట్టతగులబెట్టినప్పటికి, దానిలో ఉన్న సత్యాలు సత్యముగా నిలిచి ఉన్నాయి! నాశనాన్ని గురించిన భవిష్యత్ వాక్కులు వాస్తవమయ్యాయి! యెహోయాకీము మరణించినప్పుడు ఎవరూ అతని కొరకు దుఃఖించలేదు (యిర్మీయా 22:18)!

## ముగింపు

యెహోయాకీము తప్పేమిటి? ఒకవేళ అతని వైఖరిని ఆ నాటి ప్రజల మధ్య విశిష్టమైనది చెప్పుట ద్వారా అతని వైఖరిని సంక్షేపించవచ్చును; 2 దినవృత్తాంతములు 36:16 "వారు దేవుని దూతలను ఎగతాళి చేయుచు, ఆయన వాక్యములను తృణీకరించుచు, ఆయన ప్రవక్తలను హింసించుచు రాగా" ప్రజలు అలా చేయుటవలన యూదా నాశనమయింది. దేవుని వాక్యాలను తృణీకరించటం నాశనానికి నడిపిస్తుంది!

## మన కొరకు పాఠాలు

## దేవుని వాక్యమును "తృణీకరించుటకు" మార్గాలు

దేవుని వాక్యాన్ని తృణీకరించినది యెహోయాకీము ఒక్కడే కాదు. అన్ని కాలాలలో ప్రజలు వివిధ పద్ధతులలో దేవుని ఆజ్ఞల పట్ల నిర్లక్ష్యం చూపించారు. ఈనాడు మనం కూడ అదే మాదిరి అయిష్టతను చూపిస్తున్నాము:

### బైబిల్ దేవుని వాక్యమని గుర్తించుటకు నిరాకరిస్తున్నారు

కొందరు బైబిలు దేవుని వాక్యమని గుర్తించుటకు నిరాకరించుట ద్వారా దేవుని అధికారమునకు వారి అలక్ష్యాన్ని చూపిస్తున్నారు. వారికి, బైబిలు కేవలము మానవ వ్రాతల యొక్క సంకలనం. వాటిలో కొన్ని రచనలను వారు సత్యమైనవి, లేక చారిత్రికమైనవి లేక సహాయకరమైనవిగా చూస్తారు కాని వారు విలియం షేక్సుపియర్ రచనలకంటె, ఎక్కువ ప్రభావితము కలవి కావని ఆలోచిస్తారు.

బైబిలు దానికదే నేను పలాన అని చెప్పుకుంటుంది. అది దేవుని వాక్యమని చెప్పుకొంటుంది (2 తిమోతి 3:16, 17; 2 పేతురు 1:20, 21). బైబిలు మనుష్యులకివ్వబడిన దేవుని వాక్యమని అంగీకరించుటకు నిరాకరించువారు – ఆయన ఆజ్ఞలు నమ్మి విధేయత చూపుటకు అని నిరాకరించువారు – యెహోయాకీము చేసిన తప్పునే చేస్తూ ఆయన దేవుడైయున్నట్లుగా, ఆయన ద్వారా శిక్షింపబడుటకు ఎదురు చూస్తున్నారు.

**బైబిల్ బోధనలను అంగీకరించుటకు నిరాకరిస్తున్నారు**

ఇతరులు బైబిలు దేవుని వాక్యమని నమ్ముతారు కాని వారు ఏ భాగాలు నమ్ముతారో వాటిని ఎన్నుకొంటారు. ఏదైనా ఒక బోధ వారు ముందుగా ఆలోచించుకొన్న ఆలోచనలు బైబిలు ఏమి చెబుతుందో దానితో అవి కలవకపోతే, అప్పుడు వారు ఆ బోధను నిరాకరిస్తారు. వారికిష్టములేని వాక్యభాగము వచ్చినప్పుడు, వారు దానిని విడిచిపెట్టేస్తారు.

**బైబిలు ఆజ్ఞలకు విధేయత చూపుటకు నిరాకరించుట**

"నేను ఇతరుల వలె లేనందుకు దేవునికి కృతజ్ఞతలు! నేను బైబిలు దేవుని వాక్యమని అంగీకరిస్తాను, మరియు బైబిలు యొక్క స్పష్టమైన బోధలను నేను అంగీకరిస్తాను" అనే అంతవరకు మనమాలోచించుటకు మొగ్గుచూపాలి. ఒకవేళ మనం బహు సొంపైన వారముగా ఉండకూడదు. దేవుని వాక్యం అని ఒప్పుకొనంత మాత్రాన ఏమి నెరవేరదు కాని దానికి విధేయత చూపినప్పుడు మాత్రమే జరుగుతుంది! మనము "వినువారు మాత్రము కాక వాక్య ప్రకారం చేయువారునై" యుండటకు మనలను మనం నిరూపించుకొందాము (యాకోబు 1:22). యాకోబు ఇలా వ్రాశాడు,

> ఎవడైనను వాక్యమును వినువాడైయుండి దాని ప్రకారము ప్రవర్తింపనివాడైతే, వాడు అద్దములో తన సహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. వాడు తన్ను చూచుకొని అవతలికి పోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవును గదా అయితే స్వాతంత్ర్యము నిచ్చు సంపూర్ణమైన నియమములో తేరిచూచి నిలకడగా ఉండువాడో వాడు విని మరచువాడు కాక, క్రియను చేయువాడై యుండి తన క్రియలలో ధన్యుడగును (యాకోబు 1:23–25; చూడు మత్తయి 7:21).

యెహోయాకీము దినాలలో, దేవుని వాక్యమును చదవటం మారుమనస్సును పుట్టించుటకు ఉద్దేశింపబడినది. లేఖనాలు చదివి బోధింపబడుతున్నప్పుడు మనము వినిన దానిని బట్టి కదిలింపబడాలి – దేవుడు మనలను ఏమి చేయాలని, ఎలా ఉండాలని కోరుకొంటున్నాడో దానితో మన జీవితాలను ఐక్యపరచి జీవించుటకు మార్పు చెందేలా కదిలింపబడాలి.

బైబిలు నీకు ఏమి చేయమని చెబుతుందో దాని చేయుటకు నీవు ప్రయత్నిస్తున్నావా? ఉదాహరణకు, నిన్ను నీవు "నేను చదువుతున్నప్పుడు నీ దేహన్ని సజీవయాగముగా అర్పించాలి [రోమీయులకు 12:1], అది అలా చేయటకు నేను ప్రభావితుడనయ్యానా?" అని ప్రశ్నించుకోవాలి. అలాగే "ఇతరుల యొద్దకు సువార్త మోసుకువెళ్లాలని నేను చదివినప్పుడు [మత్తయి 28:18–20], నేనలా ప్రయత్నించేలా అది నన్ను చేస్తుందా?," "పాపంనుండి నన్ను నేను పవిత్రుడనుగా ఉంచుకోవాలి అని నేను చదివినప్పుడు [1 తిమోతి 5:22బి], లోక మాలిన్యం [యాకోబు 1:27బి] అంటకుండ ఉండుటకు నీశక్తి కొలది అలా చేయుటకు నిశ్చయించుకొన్నావా?" అని ప్రశ్నించుకోవాలి.

మనలో అనేకమంది బైబిల్లులను కలిగియుండి, వాటిని గౌరవంగా చూస్తాము మరియు ఇతరులు కూడ అలా చేయాలని కోరుకొంటాము. అయితే, అది కలిగియున్న సందేశాన్ని గౌరవముతో చూడటం అతి ప్రాముఖ్యమైన సంగతి! దేవుడు ఏమి చెబుతున్నాడు అని శ్రద్ధగా వినటం, దానిని మనకు అన్వయించుకోవటం, మరియు మనకొరకైన ఆయన ఆజ్ఞలకు శక్తికొలది విధేయత చూపటం ద్వారా దానిని మనం చేయవచ్చును!

యేసు ప్రభువు ఇలా చెప్పారు, “ఆకాశమును భూమియు గతించును గాని నా మాటలు ఏ మాత్రమును గతింపవు” (మత్తయి 24:35). పేతురు “శాశ్వతమైన జీవముగా దేవుని వాక్యము,” “ఎల్లప్పుడును నిలుచును” (1 పేతురు 1:23, 25) అని చెప్పాడు. శత్రువులు, అపవాదకులు ఏమి ఆలోచించిన లేక దాని గురించి ఏమి చెప్పినా లేక దానికి ఏమి చేసినా లక్ష్యంలేదు, దేవుని వాక్యం నాశనం లేనిది. అది ఎప్పటికి జీవించే ఉంటుంది!

---

సూచనలు

[1]యెహోయకీము ఎలా చనిపోయాడో కచ్చితంగా ఎవరికీ తెలియదు. 2 రాజులు చెప్పే వాస్తవం అతడు “తన పితరులతో కూడ నిద్రించెను” దానర్థం కేవలం చనిపోయాడని; తన పితరులతో సమాధి చేయబడ్డాడని అది తప్పనిసరి అర్థాన్ని ఇవ్వదు. (Herbert Lockyer, *All the Kings and Queens of the Bible* [Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1961], 145.) “అతని మీదికి బబులోను రాజైన నెబుకద్నెజరు వచ్చి అతని బబులోనునకు తీసకొని పోవుటకై గొలుసులతో బంధించెను” అని 2 దినవృత్తాంతములు 36:6 చెబుతుంది. అతడు బబులోనుకు వెళ్లే దారిలోనే మరణించాడని, అతని దేహము కేవలం రోడ్డు ప్రక్కకు త్రోసివేయబడినదని కొందరు నమ్ముతారు. అలాగైతే, అతడు “గాడిదల సమాధి” చేయబడ్డాడు, గాడిదలు పూడ్చిపెట్టబడవు. [2]ఆ సమయములో యిర్మీయా జీవితం కాపాడబడినది ఎందుకంటె యూదాలో ప్రముఖ నాయకుడైన అహీకాము అతనిని రక్షించాడు (చూడు యిర్మీయా 26:24).